క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే అనిల్ ఎన్నికల ప్రచారం

పమిడిముక్కల: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మర్రివాడ, గోపువానిపాలెం, గురజాడ, తాడంకి, మంటాడ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం మూడు గంటల నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

బృందగాన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: జాతీయ బృందగాన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ బహుమతి సాధించినట్లు డాక్టర్ కేకేఆర్ గౌతమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈనెల 7వ తేదీ మరట్వాడా తెలుగు అసోసియేషన్, ఏపీ కల్చరల్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బృందగాన పోటీల్లో తమ విద్యార్థులు ఘన విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. మొత్తం ఆరు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. తమ విద్యార్థులు సి. బృందావని, వి. సంకీర్తన, కె. దేవీప్రియ, ఎ. సుస్మిత, పి. హదన పరిమళ చంద్, పి. పూజశ్రీ, జి. శామ్యూల్ చరణ్, డి. సదీవన్ రాజు ఈ విజయాన్ని సాధించారన్నారు. బహుమతి సాధించిన విద్యార్థులను, సంగీత ఉపాధ్యాయుడు పి.శ్యామ్‌ను యాజమాన్యం అభినందించింది.

కనక మహాలక్ష్మి అర్బన్ బ్యాంక్ ప్రారంభం



గుడివాడ టౌన్: కనక మహాలక్ష్మి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మదుపరులకు పూర్తి హామీ ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర అన్నారు. స్థానిక గౌరీశంకరపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన కనక మహాలక్ష్మి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు, చిరు వ్యాపారులకు, మదుపరులకు ఈ బ్యాంకు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత 25 సంవత్సరాలుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో సేవలందిస్తున్న ఈ బ్యాంకు గుడివాడలో 29వ శాఖ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో ది గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జి), మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, బ్యాంక్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

ఇండియా కూటమి గెలుపు ఖాయం

పామర్రు: రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వింత సంజీవ రెడ్డి అన్నారు. స్థానిక లైన్స్ క్లబ్ హాల్లో ఇండియా(కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ) కూటమి తొలి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇండియా కూటమికి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. పామర్రు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డీవై దాసుకు విజయం సమకూర్చే విధంగా పార్టీ శ్రేణులు అందరూ పనిచేయాలని అన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధనేకుల మురళి, పీసీసీ ప్రధాన కార్యదర్శి మొవ్వా మోహన్‌రావు పాల్గొన్నారు.

12 మంది వలంటీర్ల రాజీనామా



గుడివాడ టౌన్: తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల వేధింపులు భరించలేక తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు స్థానిక 8వ వార్డు వలంటీర్లు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 12 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో బాధ్యతతో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లను టీడీపీ కార్యకర్తలు, నాయకులు అనుక్షణం అనుసరిస్తూ ప్రచారం చేస్తున్నారా? ఎక్కడికి వెళుతున్నారు? అంటూ వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ వలంటీరు పదవి ఉన్నందునే తాము ఈ ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు 8వ వార్డుకు చెందిన ఆర్. సాయికుమార్, బి. వెంకటలక్ష్మి, ఎల్. మనీషాదేవి, డి. విజయ, బి. నాగమణి, సీహెచ్. మౌనిక, ఎ. ఇందిరా రాణి, పి. అవినాష్, పి. వెంకటేశ్వరరావు, కె. హేమసాయి, ఎ. రోహియా సుల్తానా, ఎం. శ్రీనివాసరావు తెలిపారు.

ఎమ్మెల్యే కొడాలి నానికి పెరుగుతున్న ప్రజాదరణ

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానికి పట్టణ ప్రజల ప్రజాదరణ రోజు రోజుకు పెరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 21, 22 వార్డుల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మందపాడులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆలయ అర్చకులు కొడాలి నానికి హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. వార్డులోని శ్రీ కోదండ రామాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పూలవర్షం కురిపిస్తూ తామంతా జగన్ వెంటేనంటూ ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు. మందపాడు శివారు ప్రాంతంలోని గంగానమ్మ అమ్మవారికి పూజలు చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వసతులు, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వంలో వృద్ధులకు పూర్తి సహాయ సహకారాలు అందుతాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు జగన్‌మోహన్‌రెడ్డికి, చంద్రబాబు నాయుడుకు మధ్య జరుగుతున్న ఎన్నికలు కాదన్నారు. పేదలకు, చంద్రబాబు నాయుడు మోసాలు, దగాకు మధ్య పోరుగా ఆయన అభివర్ణించారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన ఐదేళ్లలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తిరిగి వైఎస్సార్ సీపీకి ఓటేస్తే రాబోయే ఐదేళ్లలో సంక్షేమ కార్యక్రమాలు మరింతగా పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, కొడాలి నాని అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో కొడాలి నానికి హారతి ఇస్తున్న అర్చకులు

స్వర్ణాంధ్ర సాకారానికి సీఎం జగన్ కృషి

మండవల్లి: స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారానికి కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండవల్లిలో గురువారం 11, 12 వార్డుల్లో ఎనిమిదో రోజు గుడ్‌మార్నింగ్ మండవల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్‌కు ప్రజలు స్వాగతం పలుకుతూ పలుచోట్ల హారతులు పట్టారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు గూడపాటి ఝాన్సీ, వైస్ ఎంపీపీ అగస్తీ ఆదివిష్ణు, సొసైటీ అధ్యక్షుడు గుడివాడ బాబీ, మాజీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి రాజు, బొబ్బిలి రత్తయ్యనాయుడు, మన్నేపల్లి ఆదాం, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బేబీసరోజిని పాల్గొన్నారు.

మండవల్లిలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

మండవల్లిలో వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ (జేవీఆర్) గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన ప్రతిపక్ష నాయకుడు అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన మెడికల్ స్కాం పెద్ద అవినీతి పుట్ట అని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్, వైస్ ఎంపీపీ అగస్తీ ఆదివిష్ణు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి రాజు పాల్గొన్నారు.



మండవల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

అగ్ని ప్రమాదాలను అరికట్టాలి



గుడివాడలో విద్యార్థులకు డెమో ఇస్తున్న ఫైర్ సిబ్బంది



పామర్రులో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి రాంబాబు

పామర్రు: వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుని అగ్ని ప్రమాదాలను అరికట్టాలని పామర్రు విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఎస్.రాంబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రామంలోని శృతి హాస్పిటల్లో అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో తలుపుతీసిన తర్వాతే గ్యాస్ స్టవ్‌ను వెలిగించాలన్నారు. పెట్రోల్, గ్యాస్ వినియోగించే చోట సెల్‌ఫోన్లు వాడరాదని తెలిపారు. అనంతరం అగ్నిమాపక నియంత్రణ సూత్రాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శృతి వైద్యశాల ఎండీ శేఖర్, వైద్యులు శృతి పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: అగ్నిమాపక వారోత్సవాలు గురువారం 5వ రోజు కూడా కొనసాగాయి. పట్టణంలోని గ్యాస్ గోడౌన్లలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. మల్లాయిపాలెం రోడ్‌లోని పెట్రోలు బంక్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు డెమో ద్వారా వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఏ విధంగా నియంత్రించాలి అనే అంశంపై స్థానిక చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చర్యలు నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ జె. ఆంజనేయులు పాల్గొన్నారు.

సింగరాయపాలెంలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెంలో కై కలూరు అగ్నిమాపక సిబ్బంది గురువారం స్థానిక గ్రోవెల్ ఫీడ్ ఫ్యాక్టరీలో మాక్‌డ్రిల్ నిర్వహించి పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు– వాటి నివారణ చర్యలను ఫ్యాక్టరి సిబ్బందికి వివరించారు. అగ్నిమాపక అధికారి కె.క్రాంతి కుమార్, గ్రోవెల్ ఫీడ్స్ జనరల్ మేనేజర్ ఎల్.చౌదరి, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ కె.వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



మండవల్లి: ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను ప్రజలు ఆశీర్వదించి ఘన విజయం అందించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ చిన్న కోడలు దూలం స్వాతి కోరారు. మండలంలోని సింగనపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి గురువారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలిరోజు ఒక్క నామినేషన్ దాఖలు

పామర్రు: పామర్రు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తొలిరోజు ఒక్క నామినేషన్ దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవి గురువారం తెలిపారు. టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా తన నామినేషన్‌ను దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఆ పార్టీ నేత సూరవరపు మనోజ్‌కుమార్, కుమార్‌రాజాను ప్రాపోజ్ చేశారని తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.

పెద్దింట్లమ్మ హుండీల ఆదాయం రూ. 14,29,977



కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లికి భక్తులు హుండీల ద్వారా చెల్లించిన కానుకలు, నగదును దేవస్థానం వద్ద గుడివాడ దేవదాయ ధర్మదాయశాఖ తనిఖీ అధికారి వి.సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. రూ. 14,29,977 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ కేవీ గోపాలరావు చెప్పారు. బంగారం 7.400, వెండి 440 గ్రాములు సమర్పించారని తెలిపారు. పెద్దింట్లమ్మ సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతుడి వాహనంపై గ్రామోత్సవం



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండ రామాలయంలో కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి హనుమంతుడి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సీతారామలక్ష్మణ సమేత విగ్రహాలను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆసూరి రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవంలో ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పాల్గొని పర్యవేక్షించారు.

పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ రావాలి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

నిడుమోలు(మొవ్వ): ప్రజలకు నిస్వార్థంగా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. తొలి రోజు ఎన్నికల ప్రచారానికి అపూర్వ స్పందన లభించింది. ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ముందుగా నిడుమోలు శివారు వీరాయిలంకలో ప్రచారాన్ని ప్రారంభించి కోళ్లపాలెం, పెద్దారాయుడుతోట, రాచర్లపాలెం, కాజ గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నిల్లో మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి, తమను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ కొమరగిరి అంజలి, వైస్ ఎంపీపీలు డి.వెంకటేశ్వరరావు, కందుల వెంకట కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సచివాలయ కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఇంగిలిపాకలంకలో ఎమ్మెల్సీ జయమంగళ ప్రచారం

మండవల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని ఇంగిలిపాకలంకలో ఎమ్మెల్సీ వెంకటరమణ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి పాలన కొనసాగేందుకు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ముంగర నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల, మల్లికార్జునరావు, సర్పంచ్ ఘంటసాల సంపత్, ఎంపీటీసీ సభ్యుడు మోరు వెంకటరమణ, నుచ్చు మిల్లి సర్పంచ్ సైదు చంద్రయ్య పాల్గొన్నారు.

పెనుమాకలంకలో...

మండవల్లి: పెనుమాకలంకలో గురువారం ఎమ్మెల్సీ జయమంగళ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ముంగర సంజయ్‌కుమార్, సయ్యపురాజు గుర్రాజు, ముంగర నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, మల్లికార్జున, సర్పంచ్‌లు పెనుమాకలంక సర్పంచ్ ముంగర నాగరాజు, మాజీ సర్పంచ్‌లు ఘంటసాల శ్రీనివాసరావు, ఘంటసాల వెంకటరాజు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో అన్నదానం..

ఇంగిలిపాకలంకలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన అన్నదానంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జయమంగళ

డీఎన్నార్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

కలిదిండి: మండలంలోని ఆవకూరులో ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విజయాన్ని కాంక్షిస్తూ ఆయన పెద్ద కోడలు శ్రీ అనుపమ గురువారం ప్రచారం చేశారు. మండల నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగేందుకు జగనన్నే మళ్లీ సీఎం కావాలన్నారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను, కైకలూరు అసెంబ్లీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గారాణి, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్ పాల్గొన్నారు.

ఆలపాడులో డీఎన్నార్ సతీమణి ప్రచారం

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు విజయం అందించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సతీమణి వీరాకుమారి కోరారు. ఆలపాడులో గురువారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నల్లగచ్చు ధనలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు పడమటి శేషావతారం, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, నాయకుడు సలాది నగేష్ పాల్గొన్నారు.



ఆలపాడులో ఎమ్మెల్యే సతీమణి వీరాకుమారి ప్రచారం

ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ అండ

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని గరికపర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం నాగమల్లేశ్వరరావు(చంటి) కుటుంబసభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. గూడూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని బోలెం నాగమల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన భార్య బోలెం శివకుమారి(54) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. శివకుమారి మృతదేహాన్ని అనిల్‌కుమార్ గురువారం సందర్శించి నివాళులర్పించారు. కుమారుడు పవన్, కుమార్తె జ్యోత్సనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి

తమ్మలంపాడు(పెదపారుపూడి): పేదలకు సంక్షేమంతో పాటు అభివృద్ధిని అందించిన వైఎస్సార్ సీపీని మరోసారి ఆశీర్వదించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. మండలంలోని తమ్మలంపాడులో వైఎస్సార్ సీపీ తరఫున గురువారం సాయంత్రం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేదలకు ఇళ్లు నిర్మించి రిజిస్ట్రేషన్ చేసి అందించారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, రైతు భరోసా తదితర పథకాలతో పేదలకు లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. తమ్మలంపాడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజలకు అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమంలో పామర్రు మార్కెట్ యార్డు చైర్మన్ తుమ్మల కోటేశ్వరరావు, ఎంపీపీ గోగం సురేష్, వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని, ఎంపీటీసీ చిగురుపాటి అశోకకుమారి, మండల కన్వీనర్ గోళ్ల సోమేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ జాజుల చిన్నారి, నాయకులు మూల్పూరి చంద్రశేఖర్, కుమ్మరి రాజేష్, బొల్లవరపు దాసు, బనంపూడి ఏసుబాబు, తుమ్మల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



తమ్మలంపాడులో ప్రచారం చేస్తున్న కైలే జ్ఞానమణి, ఎంపీపీ గోగం సురేష్

సంక్షేమ రాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

ముదినేపల్లి రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని వడాలి, అప్పారావుపేట, పెదకామనపూడిలో ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేశామని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనతో పాటు ఏలూరు ఎంపీగా పోటీ చేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి జగనన్న మళ్లీ సీఎం కావడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



వడాలిలో ఎన్నికల ప్రచారం

ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

కైకలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైస్కూళ్లలో ప్రవేశపెట్టిన బాలికల జూనియర్ కళాశాలలో మొదటి ఏడాది ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. కై కలూరు మండలం భుజబలపట్నం హైస్కూల్లో 2023లో జూనియర్ కళాశాల ప్రారంభించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ మొదటి ఏడాది ఫలితాల్లో బైపీసీ గ్రూప్‌లో 60 శాతం, సీఈసీలో 67 శాతం ఫలితాలు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు వి.చందిని 394, బి.నిర్మలా కుమారి 393, కె.దివ్యకృప 393, జి.హేమలత 349, సీఈసీలో 500 మార్కులకు జి.సుభాషిణి 362, జె.అనూష 278 మార్కులు సాధించారు. తెలుగు సబ్జెక్టులో 100కు 99 మార్కులు బి.నిర్మలాకుమారికి వచ్చాయి. తెలుగు, జువాలజీ సబ్జెక్టుల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగులో 100కు 90 శాతం మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు స్కూల్ తెలుగు పీజీటీ వీవీ రాజారావు ఒక్కొక్కరికి రూ. 1000 నగదు బహుమతిని గురువారం పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.రవిరాజు చేతుల మీదుగా అందజేశారు. హెచ్ఎం ఎస్ఎల్ రాజేశ్వరి మాట్లాడుతూ జూన్ 1 నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు డి.రామారావు, వి.శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది కార్యదర్శి వీవీ రామారావు, పీజీటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న అభివృద్ధి కమిటీ చైర్మన్ రవిరాజు

మంచినీటి చెరువుల పరిశీలన

మండవల్లి: మంచినీటి చెరువులకు నీటిని నింపే ప్రక్రియను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, డీఎల్పీఓ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పాపురం నుంచి మండవల్లి, భైరవపట్నం గ్రామాల మంచినీటి చెరువులకు నీటిని తరలించే ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఎంపీడీఓ ఆర్.బేబీశ్రీలక్ష్మి, అప్పాపురం, పెరికెగూడెం, భైరవపట్నం కార్యదర్శులు శ్రీనివాస్, రాధిక, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురంలో శ్రీ సీతారామలక్ష్మణ సహిత అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా గురువారం స్వామివార్ల ప్రధానమూర్తులను, ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి మేళ, తాళాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.